సాక్షి చిత్తూరు

గురువారం । 24 । జూలై । 2025



మద్దతు ధరపై..
మామిడి మద్దతు ధరపై స్పష్టత లేక అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. - 8లో



కిక్కిరిసిన బోయకొండ
బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. గంటల తరబడి క్యూలో ఉండి దర్శించుకున్నారు. - 8లో



ఇల్లు దగ్ధం
గుడిపాల మండలంలోని కట్టకింద పల్లెలో విద్యుదాఘాతానికి ఇల్లు దగ్ధమైంది. రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. - 8లో

న్యూస్‌రీల్

ఆటో దహనం కేసుపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



ఎస్టీ కమిషన్ శంకర్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న చిరంజీవి, రాజయ్య

పుత్తూరు : మున్సిపాలిటీ పరిధిలోని వినాయకపురం ఎస్టీ కాలనీలో ఈనెల 18వ తేదీ రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజయ్య ఆటోను దుండగులు కాల్చివేసిన ఘటనపై బాధితుడు బుధవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావును కలిసి ఫిర్యాదు చేశారు. రేణిగుంటలోని గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్టీ కమిషన్‌ను వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి, బాధితుడు రాజయ్య కలిసి ఆటో దహనం కేసులో నిందితులను త్వరగా గుర్తించి తమకు తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై కమిషన్ శంకర్‌రావు మాట్లాడుతూ.. పోలీసులు కేసును తప్పుదారి పట్టిస్తే ఎస్టీ కమిషన్ తగిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోదని స్పష్టం చేశారు. గిరిజన ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. ఆస్తి నష్టం చర్యలతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కూడా నమోదుకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు.

పరిసరాల పరిశుభ్రత ప్రజల బాధ్యత




స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈఓ

కార్వేటినగరం : పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రజలదేనని జడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీడీ కండ్రిగలో నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక ప్రజలే బాధ్యత వహించాలని, అప్పుడే చెత్త రహిత గ్రామాలు ఏర్పాటు అవుతాయన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించిన బుట్టలలో తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. జిల్లా స్థాయిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే టీకేఎం పేట గ్రామంలో పర్యటించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, కార్యదర్శులు, ఏకాంబరం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు సీఐ వీఆర్‌కు!

పుత్తూరు : స్థానిక సీఐ కే.బీ.సురేంద్రనాయుడు వీర్ (వేకన్సీ రిజర్వు)కు బదిలీ అయ్యారు. సోమవారం ఎస్పీ కార్యాలయం నుంచి వీర్ ఆదేశాలను అందుకున్న సీఐ అదేరోజు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వీర్ బదిలీ కేవలం రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే జరిగినట్లు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. అయితే సీఐపై ఇటీవల పలు ఆరోపణలు వచ్చినట్లు అందుకు తగిన ఫలితమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

ప్రజలను నమ్మించి..గద్దెనెక్కాక నిలువునా మోసం చేయడంలో తనను మించిన వారు లేరని సీఎం చంద్రబాబు మరోమారు చాటుకున్నారు. మహాశక్తిలో భాగంగా ప్రకటించిన ఆడబిడ్డ నిధిపై ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం ఉలుకూ పలుకులేదు. ఎప్పుడో ఒకసారి ఇస్తారులే అని మహిళలకు ఏ మూలో ఆశ ఉండేది..కానీ ఆడ పడుచుల ఆశలపై మంత్రి అచ్చెన్నాయుడు నీళ్లు గుమ్మరించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాల్సిందేనని వ్యాఖ్యానించడంపై మహిళా లోకం భగ్గుమంటోంది. మంత్రి ఇలాంటి ప్రకటనలు చేయడం వెనుక పథకం ఎగవేత కుట్ర దాగుందని మహిళలు ఆవేదన చెందుతున్నారు.



ఆడబిడ్డకు శఠగోపం!

మహాశక్తి ఆడబిడ్డ నిధికి కూటమి మంగళం ?

- ఆ పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాల్సిందేనన్న మంత్రి
- మంత్రి వ్యాఖ్యలపై మండిపడుతున్న మహిళలు
- ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్న కూటమి
- ఆడబిడ్డలను నమ్మించి మోసం చేసిన బాబు సర్కారు

జిల్లాలో ఆడబిడ్డ నిధి వివరాలు ఇలా..

నియోజకవర్గం	ఆడబిడ్డ నిధికి అర్హులు	ఏడాదిగా అందాల్సిన మొత్తం (రూ.కోట్లల్లో)
పుంగనూరు	1,71,089	రూ.307.96
నగరి	1,53,112	రూ.275.60
జీడీ నెల్లూరు	1,54,203	రూ.277.56
చిత్తూరు	1,48,682	రూ.267.62
పూతలపట్టు	1,59,027	రూ.286.24
పలమనేరు	1,97,841	రూ.356.11
కుప్పం	1,65,707	రూ.299.29

రూ. 2,069.38 కోట్ల బకాయిలు చెల్లించాలి

జిల్లా వ్యాప్తంగా 2025 జనవరి వరకు అధికారిక నివేదికల ప్రకారం 18 ఏళ్ల పైబడి 100 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు 11,49,661 మంది ఉన్నారు. బాబు సర్కారు ఆడబిడ్డ నిధికి సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.2069.38 కోట్లు బకాయి పడింది. అంటే సరాసరి ఒక్కో మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏడాదిగా పథకాల అమలులో గోల్‌మాల్ చేస్తూ నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాల అమలుపై నోరు మెదపలేదు. ఇటీవల మంత్రి చాలా స్పష్టంగా ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసే పరిస్థితి లేదని బాహాటంగా చెప్పడంతో కూటమి సర్కారు నైజం బయటపడిందని, రానున్న రోజులలో ప్రజా వ్యతిరేకతను బాబు సర్కారు ఎదుర్కోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : మహిళలకు బాబు నైజంపై అవగాహన ఉంది. కానీ 2024 సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ అధినేత చంద్రబాబు మారిన మనిషినంటూ జనాన్ని నమ్మించాడు. అమలుకు నోచుకోని హామీలను గుప్పించి అధికారం చేజిక్కించుకున్నాడు. అంతే షరా మామూలే హామీలను గాలికొదిలేసి నమ్మి ఓటు వేసిన మహిళలకు శఠగోపం పెట్టేశాడు. మహిళలను మహాశక్తి మంతులను చేస్తానని నమ్మబలికి ఆడబిడ్డ నిధి పథకంతో 18 ఏళ్లు నిండిన కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని ప్రగల్భాలు పలికాడు. మోసపూరిత హామీలతో మహిళలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారం చేపట్టాడు. బాబు సర్కారు ఆడబిడ్డ నిధికి మంగళం పాడేస్తున్నట్లు మంత్రి ద్వారా సంకేతాలు పంపుతున్నట్లు తెలుస్తోంది.

ఆంధ్రాను అమ్మాల్సిందే...!

కూటమి అధికారంలోకి వచ్చిన మరుసటి నెల నుంచి సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తామన్న హామీలను బాబు సర్కార్ గాలికి వదిలేసింది. సూపర్ సిక్స్ హామీలలో ఆడపడుచులకు సంబంధించి మహాశక్తిలో భాగంగా బాబు ప్రకటించిన ఆడబిడ్డ నిధిపై ఏడాది గడుస్తున్నా నోరు మెదపలేదు.

దీంతో ఎప్పుడో ఒకప్పుడు ఇస్తారులే అంటూ ఆశతో ఎదురు చూస్తున్న మహిళలకు ఒక్కసారిగా బాబు సర్కార్ జలక్ ఇచ్చింది. స్వయానా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఓ సభలో ఆడబిడ్డ నిధి అమలుపై ప్రజలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. మహాశక్తి ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మేయాల్సిన పరిస్థితి వస్తుందని బహిరంగంగా ప్రకటించేశారు. దీంతో ఆడబిడ్డ నిధికి మంగళం పాడేశారని, తమను నమ్మించి మోసం చేశారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల సమయంలో తెలియదా ?



అధికార దాహంతో హామీలను గుప్పించి మహిళలను మభ్యపెట్టి అధికారం చేపట్టారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి తీరుతా అంటూ చంద్రబాబు ప్రతి ఎన్నికల సభలో ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు చేతులెత్తేసి మా వల్ల కాదు అంటూ చెబుతున్నారు. సాక్షాత్తు మంత్రి అచ్చెన్ననాయుడు ఆంధ్రాను అమ్మితేగాని ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమంటూ తేల్చిచెప్పడం విడ్డూరంగా ఉంది. హామీలు గుప్పించిన నాడు ఈ విషయం తెలియదా.

– దీప, పాల సముద్రం మండలం

మహిళల ఆగ్రహం తెలుస్తుంది..



కూటమి సర్కార్ ఎన్నికల హామీలను అమలు చేయకుంటే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు. అధికారం కోసం మహిళలను మభ్యపెట్టి ఆడబిడ్డ నిధి పథకాన్ని షరతులు లేకుండా అమలు చేస్తామని చెప్పారు. నేడు అమలు చేయలేమని చేతులెత్తేయడం కూటమి ప్రభుత్వం అసమర్థ పాలనకు నిదర్శనం. జిల్లాలో లక్షల మంది మహిళలు ఆడబిడ్డ నిధి పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారు.

– సునీత, పాలసముద్రం

మోసం చేయడం దారుణం



ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమని సాక్షాత్తు మంత్రి ప్రకటించడం ఆశ్చర్యమేసింది. ఎన్నికల సమయంలో అమలు చేయలేమని తెలిసీ హామీ ఇచ్చారంటే మహిళలను వంచించి మోసం చేసి ఓట్లు దండుకుని అధికారం చేపట్టాలనే లక్ష్యంతో హామీలు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. జిల్లాలోని ప్రతి ఇంటిలో మహిళ ఈ పథకం అమలు చేస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశారు.

– కవిత, నగరి

న్యాయం చేస్తారని ఓటు వేశాం



నేను దినసరి కూలిని. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సీఎం అయితే ఆడబిడ్డ నిధి పథకం కింద కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. దీంతో నమ్మి ఆశతో ఓటు వేశాం. ఇంతవరకు రూపాయి కూడా ఇవ్వలేదు. సంవత్సరం గడిచింది. న్యాయం చేస్తారని నమ్మి మోసపోయాం.

– విజయ, కార్వేటినగరం

మోసం చేయడం న్యాయమా..?



ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చకుండా మహిళలను వంచించడం దారుణం. ఆడబిడ్డ నిధి కింద కుటుంబంలోని ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి నేతలు ప్రకటించారు. దీంతో పెద్ద ఎత్తున మహిళలు ఆ పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారు. మహిళలు ఎంతో నమ్మకంగా ఇచ్చిన అధికారాన్ని అంతే నమ్మకంతో ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేయాలి.

– ధనలక్ష్మి, చిత్తూరు నగరం

మంత్రి మాటలు బాధపెట్టాయ్...



సార్వత్రిక ఎన్నికలలో అధికార వాంఛతో కూటమి నేతలు మహిళలను మభ్యపెట్టి పథకాలను ప్రకటించి అమలు చేసి తీరుతామంటూ ప్రగల్భాలు పలికారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా పథకాల ప్రస్తావనే రావడం లేదు. ఉచిత బస్సుతో పాటు ఆడబిడ్డ నిధిని నిర్వీర్యం చేశారు. లక్షల మంది మహిళలు ఆడబిడ్డ నిధి కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న తరుణంలో మంత్రి బహిరంగ సభలు పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మేయాలి అంటూ వెటకారంగా మాట్లాడటం ఎంతో మందిని బాధించింది.

– జయంతి, చిత్తూరు నగరం

ఇద్దరు ఎంఈవోలకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాలు బోధించాల్సిన టీచర్ల చేత బియ్యం మూటలు మోయిస్తున్నారనే సమస్యపై సాక్షి దినపత్రికలో ఈనెల 23న అయ్యోర్లకు బియ్యం మోత అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనం పై డీఈవో వరలక్ష్మి స్పందించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు బియ్యం మోసుకెళ్లాలని ఆదేశించలేదన్నారు. ఇందుకు సమగ్రశిక్ష శాఖ పరిధిలో పని చేసే సిబ్బందికి బాధ్యతలు ఉన్నాయన్నారు. అయితే పలు మండలాల్లో టీచర్లకు బియ్యం తీసుకెళ్లాలని ఎంఈవోలు ఆదేశించడం తగదన్నారు. ఈ విషయంపై ఆరా తీసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా స్పందించిన విద్యాశాఖ అధికారులు అలసత్వం వహించిన రెండు మండలాల ఎంఈవో-2కు షోకాజ్ నోటీసులు జారీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

నేడు పీవీకేఎన్‌లో కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24వ తేదీన ఒప్పంద అధ్యాపకులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గత విద్యాసంవత్సరంలో 30-04-2025 వరకు పనిచేసిన ఒప్పంద అధ్యాపకుల కాలాన్ని ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొనసాగించేందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియకు జాయింట్ కలెక్టర్ హాజరవుతారని వెల్లడించారు.

బోయకొండ ఇంటి దొంగలపై విచారణ




ఆలయ కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఈఓ, ఎస్‌ఐ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో టికెట్ల విక్రయాల్లో సిబ్బంది చేతివాటం చూపారు. సాక్షిలో ఇంటిగుట్టు రట్టు కథనంపై స్పందించిన ఈఓ ఏకాంబరం, ఎస్‌ఐ నాగేశ్వరరావు బుధవారం విచారణ చేపట్టారు. బోయకొండ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి పెద్ద భోగం మొక్కులు చెల్లించేందుకు భక్తులకు విక్రయించిన రూ.200 టికెట్ల కౌంటర్ ఫైళ్లను పరిశీలన చేపట్టారు. ఒక్కొక్క టికెట్ల పుస్తకంలో వంద టికెట్లు ఉన్నాయని వాటిలో అధికారుల సంతకాలు లేకుండానే భక్తులకు టికెట్లు ఎలా విక్రయిస్తారని పోలీసులు ప్రశ్నించారు. టికెట్లు విక్రయించగా కార్యాలయానికి కౌంటర్ ఫైల్ వచ్చినప్పుడు ఎందుకు పరిశీలించలేదనే అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు బాధ్యులైన ఆలయ సిబ్బందిని పోలీసులు విచారణ చేపట్టారు. ఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురు సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాణిపాకం : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగష్టు 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఈవో తెలిపారు. ఆసక్తిగల కళాకారులు ఆగష్టు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం ఆస్థాన మండపంలో ప్రతిరోజు రాత్రి ఈ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

జిల్లా మైనింగ్ శాఖ కార్యాలయానికి అవినీతి చెద పట్టింది. ఓ అధికారి పెత్తనం కార్యాలయంలో పెచ్చుమీరింది. ఆ అధికారి గుప్పెట్లోనే కార్యాలయం నడుస్తోంది. అధికార పార్టీ అండ ఉందని ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నాడు. అక్రమ కార్వీలకు ఆజ్యం పోస్తున్నాడు. అడ్డగోలుగా వసూళ్లకు తెరలేపాడు. నెలవారి మామూళ్ల మత్తులో జోగుతున్నాడు. ఉన్నతాధికారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆ అధికారి అందిన కాడికి దోచుకుంటున్నాడు. అక్రమ గ్రానైట్ తరలింపునకు దగ్గరుండి సరిహద్దులు దాటిస్తూ అక్రమాలకు అలంబనగా నిలుస్తున్నాడు.



జిల్లా మైనింగ్ శాఖ కార్యాలయం

అక్రమాలగనుడు

- మైనింగ్‌శాఖ కార్యాలయంలో ఓ అధికారి ఇష్టారాజ్యం
- అక్రమ క్వారీలకు ఆజ్యం.. అడ్డగోలుగా వసూళ్లు
- జిల్లా మైనింగ్‌శాఖ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు
- ఆ అధికారి గుప్పిట్లో కార్యాలయ నిర్వహణ
- నెలవారీ మత్తులో జోగుతున్న ఆ అధికారి
- గ్రానైట్ బండలకు రైట్..రైట్
- రెవెన్యూ, పోలీసులపై నిందలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు నగరంలోని ఎస్టేట్ ప్రాంతంలో జిల్లా మైనింగ్ శాఖ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో పదుల సంఖ్యలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ కార్యాలయంలో ఓ అధికారి తీరు మామూలుగా లేదు. ఇతను చెప్పిందే వేదంగా నడుస్తోంది. సెటిల్‌మెంట్ విషయంలో ఇతనిదే పైచేయి. అతని అక్రమాలకు ఎవరైనా అడ్డొస్తే...వారి తల మరుగు కావాల్సిందే. ఉన్నతాధికారి కూడా ఆయన ఎక్కడ సంతకం పెట్టాలంటే అక్కడ సంతకం పెట్టాల్సిందేనని శాఖలోని పలువురు ఆరోపిస్తున్నారు.

మంత్రి బంధువునని చెప్పి..

కూటమి అధికారంలోకి వచ్చాక ఆ అధికారి పావులు కదిపాడు. మంత్రి బంధువని చెప్పి..జిల్లా కార్యాలయంలోకి చొరబడ్డాడు. ఉన్నతాధికారిని గుప్పెట్లో పెట్టుకున్నాడు. అతని కార్యకలాపాలకు ఎవరైనా అడ్డొస్తే కూటమి నేతల నుంచి వారికి క్లాస్ పీకిస్తాడు. ఇలా అందరి నోరు మూయించి... వసూళ్లకు అడ్డు తొలగించుకున్నాడు. ఇప్పుడు కార్యాలయంలో ఆయన చెప్పిందే వేదంగా నడుస్తోంది. ఏ పని కావాలన్నా ఆ అధికారి ద్వారానే జరిగేలా చేసుకున్నాడు. కార్యాలయంలో ఆయన పేరు వింటేనే ఉన్నతాధికారి నుంచి సిబ్బంది వరకు హడలిపోతున్నారు. ఆ భయాన్ని బలంగా చేసుకుని ఆ అధికారి ఆడిందే..ఆట.. పాడిందే పాటగా చెలరేగిపోతున్నాడు.

రెచ్చిపోతున్న మాఫియా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. విచ్చలవిడిగా అక్రమ గ్రానైట్ తవ్వకాలు జోరందుకున్నాయి. బంగారుపాళ్యం, చిత్తూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం, యాదమరి తదితర మండలాల్లోని పలు ప్రాంతాల్లో అక్రమ క్వారీ తవ్వకాలు జోరందుకున్నాయి. లక్షల రూపాయలు విలువ చేసే సరుకు (గ్రానైట్ బండ) తమిళనాడుకు తరలుతోంది. ఇదీ తెలిసినా అధికారులు కార్యాలయానికే పరిమితం అవుతున్నారు. అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోలేకపోతున్నారు. గ్రానైట్ బండలు రాత్రి పూట రయ్.. రయ్ మంటూ రోడ్ల మీద కళ్ల ఎదుటే కనిపించినా పట్టించుకోకుండా చూస్తూ.. ఉండిపోతున్నారు. అక్రమాలకు అండగా నిలబడుతున్నారు. దగ్గరుండి హద్దు దాటిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. మాకు సంబంధం లేదు...అది రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ చూసుకోవాలని చేతులెత్తేస్తున్నారు.

మామూళ్లు ముట్టజెప్పాల్సిందే..

జిల్లాలో విలువైన క్వారీలు నడుస్తున్నాయి. ఇందులో అక్రమ క్వారీలు, అనుమతి తీసుకున్న క్వారీలు కూడా ఉన్నాయి. అనుమతులతో నడుస్తున్న క్వారీల నుంచి ఆ అధికారికి నెలనెలా రూ.50 వేలు ముట్టాల్సిందే. లేకుంటే ఆ అధికారి ఒక్క బండ కూడా క్వారీ నుంచి కదలకుండా చేస్తున్నారని క్వారీ నిర్వాహకులు చెబుతున్నారు. లేకుంటే అధికార పార్టీ నాయకుల నుంచి వారికి ఇబ్బందులు పెట్టిస్తున్నాడని వాపోతున్నారు. ఇక అక్రమ క్వారీల నుంచి రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూళ్లు చేస్తున్నాడని క్వారీ నిర్వాహకులే బహిరంగంగా చెబుతున్నారు. ఇలా ప్రతి నెల రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అక్రమ ఆదాయం గడిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ శాఖను పట్టించుకునే వారు లేకపోవడం, ఉన్నతాధికారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆ అధికారి వసూళ్లల్లో రైట్ రాయల్‌గా దూసుకెళుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి : కలెక్టర్



సంగమంగళం వద్ద ఫ్లై ఓవర్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుడిపాల : రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. బుధవారం గుడిపాల మండలంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని నంగమంగళం వద్ద ఉన్న రోడ్డు, బ్రిడ్జి, ఎంసీఆర్ క్రాస్ వద్ద, సీఎంసీ ఆస్పత్రి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు పనులను నిర్లక్ష్యంగా చేయడంతో ఇప్పటి వరకు 14 మంది చనిపోగా 46 మంది గాయపడ్డారని ఎస్పీ తెలియజేశారు. వీటన్నింటిని కలెక్టర్ పరిశీలించి సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. మిగిలిన ముఖ్య కూడల్లో రేడియం స్టిక్కర్స్, లైటింగ్, జీబ్రా క్రాసింగ్ లైన్స్, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత కన్‌స్ట్రక్షన్ వారికి, సీఎంసీ ఆస్పత్రి అధికారులకు ఆయన సూచించారు. సీఎంసీ ప్రతినిధి ప్రిన్స్, గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గోకులం' నిర్మాణాల్లో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నిర్మిస్తున్న గోకులం షెడ్ల నిర్మాణంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి వారం గోకులం షెడ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష ఉంటుందన్నారు. మండలాల వారీగా ఎన్ని పనులు ఆమోదించారు...? ఎన్ని పూర్తి చేశారు ? బిల్లులు జనరేట్ చేశారా లేదా పలు అంశాలపై సమీక్షిస్తామన్నారు. నాణ్యతగా నిబంధనల మేరకు షెడ్లను నిర్మించాలన్నారు. ఎలాంటి అలసత్వం వహించినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గోకులం షెడ్ల నిర్మాణంలో ఏపీడీలు, ఏపీవోలు మార్కింగ్ చేసిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 2795 పనులకు రూ.62.93 కోట్ల నిధులతో పనులు చేపట్టగా 1588 పనులు పూర్తి చేసినట్లు వివరించారు. కాన్ఫరెన్స్‌లో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ప్రొబేషనరీ ఎస్‌ఐలు


ఎస్పీతో ప్రొబేషనరీ ఎస్‌ఐలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠను పలువురు ప్రొబేషనరీ ఎస్‌ఐలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు ఎనిమిది మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలను కేటాయిస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తనను కలిసిన ట్రైనీ ఎస్‌ఐలతో ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో సఖ్యతగా ఉండాలని, నిజాయితీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. త్వరలోనే వీరిని స్టేషన్లకు కేటాయించనున్నారు.

మద్దతు ధరపై అయోమయం

- మామిడి మద్దతు ధరలపై రైతులకు స్పష్టత లేని వైనం
- మద్దతు ధర రూ.12కు ఎసరు
- మళ్లీ ప్రోత్సాహక నిధిపై సందిగ్ధం
- నిధుల కేటాయింపుపై అనుమానాలు


మామిడితోటను నరికివేసిన రైతులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : పండిన పంటను విక్రయించుకోవడానికి ఇన్నాళ్లు ఫలరాజులు పస్తులతో గడిపారు. నిద్రలు మాని రోడ్డెక్కారు. ఇప్పుడిప్పుడే ఆ బాధ నుంచి కోలుకుంటున్న రైతులకు ధరలు షాక్ ఇస్తున్నాయి. మద్దతు ధర దక్కకపోగా స్పష్టత లేని ధరలతో అయోమయానికి గురవుతున్నారు. మళ్లీ ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహక నిధి విషయం సందిగ్ధంలో పడేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం మాయమాటలతో మామిడి రైతులను మభ్యపెడుతోందని , నిధుల కేటాయింపుపై మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు డమాల్..

జిల్లా వ్యాప్తంగా మామిడిలో తోతాపురి రకం 39,895 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. వీటి ద్వారా 4.99 లక్ష టన్నుల కాయలు దిగుబడి అయినట్లు అధికారుల అంచనా. జూన్ ఆరంభంలో తోతాపురి కోతలతో పాటు విపత్తు మొదలైంది. దీంతో కూటమి ప్రభుత్వం తోతాపురి కేజీకి రూ.12 మద్దతు ధర ప్రకటించింది. ఈ మద్దతు ధరలో ఫ్యాక్టరీలు కేజీకి రూ. 8, ప్రభుత్వ ప్రోత్సాహ నిధి కేజీకి రూ.4 చొప్పున చెల్లిస్తామని వెల్లడించింది. తీరా ఫ్యాక్టరీలు ప్రకటించిన రూ.8కి కొనుగోలు చేయలేమని చేతులెత్తేసింది. ఈ కారణంగా రైతులు రోడ్డెక్కారు. స్పందించిన జిల్లా యంత్రాంగం ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడి కాయలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. తొలుత ఫ్యాక్టరీలు కేజీకి రూ.6లే ఇస్తామని ప్రకటించింది. ఆ తర్వాత రూ.5, రూ.4కు తగ్గించింది. ర్యాంపుల్లో కేజీ రూ. 2 నుంచి రూ.4 వరకు కొనుగోలు చేసింది. దీనిపై విమర్శలు వెలువెత్తడంతో ఆ తర్వాత చెల్లింపు ధర విషయాన్ని ఫ్యాక్టరీలు దాచిపెట్టారు. ఈక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశించిన.. ఆ ఆదేశాలు ఫలించలేదు. అనంతరం కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఫ్యాక్టరీ నిర్వాహకులతో చర్చించారు. ఆ చర్చలు కూడా విఫలమమై మద్దతు ధరకు ఎసురు పడింది.

అష్టకష్టాలు పడి..

రైతులు అష్టకష్టాలు పడి కాయలను ఫ్యాక్టరీలకు తరలించారు. ఇప్పటి వరకు ఫ్యాక్టరీలకు 26221 మంది రైతులు 2,26,660 మెట్రిక్ టన్నుల కాయలను విక్రయించారు. అలాగే ర్యాంపుల ద్వారా 14637 మంది రైతులు 1,01,175 టన్నుల కాయలు తరలించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నారు. అయితే రైతు అయోమయంలో పడ్డారు. తరలించిన కాయల లెక్కలు పక్కాగా ఉన్నాయా..? కేజీ ధర ఎంత ఇస్తారు..? ఇందులో ఫ్యాక్టరీలు ఎప్పుడు ఇస్తాయి..? ప్రభుత్వం రూ.4 ఎప్పుడు చెల్లిస్తుంది..? కేంద్రం ప్రకటించిన మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం వర్తింపును ఎలా అమలు చేస్తారు? ప్రభుత్వ ప్రోత్సాహక నిధి ప్రకటింపు ప్రకారం ఇస్తారా లేదా...కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా రూ. 3.85 ప్రకారం ఇస్తారా అనే అయోయయంలో రైతులు పడ్డారు. మామిడి ధరల విషయంపై కూటమి ప్రభుత్వం కేంద్రానికి ఆలస్యంగా లేక పంపడంపై రైతులు విస్తుపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో మామిడికి గరిష్ఠ పరిమితి 1,62,500 టన్నులకు గాను క్వింటాకు ధర రూ.1,490,73గా నిర్ణయించడంపై వారు మండిపడుతున్నారు. ఈ విక్రయంలో కూడా రైతులకు పలు ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా 2.50 టన్నుల మామిడికి ఆర్థిక సాయం ప్రకటిస్తూ..క్వింటాకు రూ.1,616 ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

మామిడి తోటలను వదిలించుకోవాలని..


మామిడి చెట్లను నరికి లారీలో తరలిస్తున్న దృశ్యం

ఈసారి మామిడి ఇచ్చిన దెబ్బకు రైతులు ఉలిక్కిపడ్డారు. సిండికేట్‌కు హడలిపోయారు. దీంతో రైతులు కుప్పకూలిపోయారు. తీరా మామిడిని వదిలించుకుంటే మేలని సిద్ధమయ్యారు. చిత్తూరు జిల్లాలో పాటు తిరుపతి జిల్లాలో కూడా విచ్చల విడిగా మామిడి తోటలను తొలగిస్తున్నారు. ఎక్కడికక్కడే మామిడి చెట్లను నరికేస్తున్నారు. విస్తారంగా తోతాపురికి కోతలు పెడుతున్నారు. ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. ఇది ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని కొందరు ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు. అటవీశాఖ అధికారుల ద్వారా రైతులకు జరిమానా, కేసుల పేరుతో బెదరిస్తున్నారు. ఈ క్రమంలో పంట పండక పోతే...అధికారులు మా కడుపులు నింపుతారా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

అసమర్థ పాలన



జూలై 21న కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ డిప్యూటీ కమిషనర్ రాష్ట్ర వ్యవసాయశాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీకి లేఖ రాస్తూ... 1.62 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కిలోకు రూ.3.85 కు మద్దతు ధర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఇస్తుందని చెప్పారు. తోతాపురి కాగడా పెట్టి వెదకని రోజులలో ఈ లేఖ రాశారు. ఆ రోజు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యం వస్తున్నారంటే.. తోతాపురి మామిడి ఎక్కడుంది...అంతా కొనుగోలు చేశారని ఊదరగొట్టి రాసిన టీడీపీ కర్ర పత్రికలు, ఛానెళ్లు ఇప్పుడు ఏం చెబుతాయి. ఈ స్థాయిలో కొనుగోలు చేయాలంటే వచ్చే ఏడాది కావాలే తప్ప.. ఈ ఏడాది లేవు. ఇప్పుడు మద్దతు ధర ప్రకటించి ఏం ప్రయోజనం. గతంలో కేజీకి రూ.4 ఇస్తానన్న చంద్రబాబు ఇవ్వలేదు. ఇప్పుడు కేంద్రం, రాష్ట్రం కలిసి రూ.3.85 కు చెరిసగం భరిస్తూ కొనుగోలు చేస్తామని రాశారు. పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో కుమారస్వామికి స్వాక్షాత్తూ కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి లేఖ రాస్తే... పదవీ విరమణ చేసిన ఎక్స్ అఫిషియో సెక్రటరీకి కేంద్ర వ్యవసాయశాఖ డిప్యూటీ కమిషనర్ లేఖ రాశారు. అంటే ఈ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వానికి ఏ స్థాయి గౌరవం ఉందో ఈ లేఖను బట్టి తెలుస్తోంది.

– భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్

27న ఉచిత యోగా శిక్షణ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని సంతపేటలోని పీసీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ఈనెల 27న నిర్వహించే ఉచిత సిద్ధ సమాధి యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యోగాచార్యులు నరేంద్ర తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు 14 రోజుల పాటు నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలు, ఆహారపు అలవాట్లు, పంచకోశశుద్ధి, శారీరక సూక్ష్మ వ్యాయామాలు మొదలైనవి నేర్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 8247609140, 9441473526 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం


ప్రసన్నకుమారికి చెక్కు అందిస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ రెండు వారాల క్రితం మృతి చెందిన దయాసాగర్ కుటుంబానికి ఎస్పీ మణికంఠ ఆర్థికసాయం అందచేశారు. బుధవారం చిత్తూరులోని పోలీసు కార్యాలయంలో మృతుడి భార్య ప్రసన్నకుమారికి ఐడీఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ.లక్ష నగదును చెక్కు రూపంలో అందించారు. దయాసాగర్ కుటుంబానికి అండగా ఉంటామని, ఎలాంటి అవసరం వచ్చినా ఆదుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

మామిడి మొక్కల పెరికివేత


మామిడి మొక్కలను పెరికివేసిన దృశ్యం

శ్రీరంగరాజపురం : నాటిన మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు పెరికివేసిన సంఘటన మండలంలోని శ్రీరంగరాజపురంలో చోటు చేసుకుంది. బాధితుడు హేమాద్రి కథనం మేరకు యు.ఎం.పురం గ్రామానికి చెందిన హేమాద్రి తాత అబ్బయ్య పేరిట ఉన్న ఎకరా పొలంలో నాటిని 70 మామిడి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు పెరికివేశారని వాపోయాడు. దీనిపై స్థానిక పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇల్లు దగ్ధం


బీరువా మొత్తం కాలిన దృశ్యం

గుడిపాల : విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం అయ్యింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గుడిపాల మండలంలోని కట్టకిందపల్లె హరిజనవాడకు చెందిన కృపాకరన్ ఇంటిలో బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. బెడ్ రూమ్‌లో చెలరేగిన మంటలతో బీరువా మొత్తం పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న నగదు రూ.1,20,000, 5 సవర్ల బంగారం కాలిపోయింది. దీంతో పాటు చీరలు, మంచాలు, ఇంటి , పొలం పత్రాలు బూడిదయ్యాయి. ఇంటిలో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధం అయ్యింది. 10 లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

జీవాలపై అడవి జంతువుల దాడి


గొర్రెల కళేబరాలు

శాంతిపురం: మండలంలోని చెంగుబళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి గొర్రెల మందపై అటవీ జంతువులు దాడి చేశాయి. దీంతో 22 జీవాలు మృతి చెందగా, మరో 10 గాయపడినట్లు గొర్రెల యజమాని జంగం కృష్ణప్ప తెలిపాడు. బుధవారం వేకువజామున ఈ విషయం గుర్తించినట్లు వెల్లడించారు. ఈ దాడిలో సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు సర్పంచ్ పూలకుంట భాస్కర్ వెల్లడించారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ శివయ్య, ఎస్‌ఐ నరేష్, పశువైద్యాధికారి ఆమని ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. రేచుకుక్కలు లేదా తోడేళ్ల గుంపు గొర్రెలపై దాడి చేసినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ట్రాక్టర్ చోరీ

గుడిపాల : మండలంలోని పశుమంద హరిజనవాడకు చెందిన వినాయకం అనే వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్ చోరీకి గురైనట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. పశుమంద దళితవాడకు చెందిన వినాయకం 2018లో సొంతంగా ట్రాక్టర్ తీసుకున్నాడు. అప్పటి నుంచి అతడి పనులు చేసుకుంటూ ఉండేవాడు. అతడి ట్రాక్టర్‌ను నరహరిపేట–రామాపురం రోడ్డు సమీపంలోని పశు మందలోని పశువుల షెడ్డు వద్ద ట్రాక్టర్‌ను పెట్టేవాడు. కాగా 22వ తేదీ ఉదయం ట్రాక్టర్‌ను చూసుకోగా ఎక్కడా కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ట్రాక్టర్ కనపడకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా హౌసింగ్ పీడీగా సుబ్రహ్మణ్యం

సాక్షి ఎఫెక్ట్..



పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్రహ్మణ్యం, గోపాల్ నాయక్ సస్పెన్షన్, నూతన పీడీ ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ అవినీతి ఆరోపణల కారణంగా ఈనెల 14న ఆయనను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన ఈనెల 15వ తేదీ నుంచి పీడీ కేడర్‌లో కార్యాలయానికి వచ్చి పలు ఫైల్స్‌లో సంతకాలు చేశారు. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో ఈనెల 23వ తేదీన వదల బొమ్మాళీ....వదలా అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ స్పందించారు. గోపాల్ నాయక్ సస్పెన్షన్ విషయం పై ఆరా తీశారు. వెంటనే ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను అమలు చేయాలని ఆదేశించారు. అదే విధంగా జిల్లా హౌసింగ్ పీడీగా కుప్పం ఈఈగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నూతన హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని హౌసింగ్ శాఖ కార్యాలయంలో పీడీగా బాధ్యతలు స్వీకరించారు.

కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఒక్కరోజే సుమారు 15 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.ఆలయ ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇక 'స్మార్ట్' బాదుడు !

- ఇప్పటికే కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు
- త్వరలో గృహాలు, ఆపై వ్యవసాయ మోటార్లకు బిగింపు
- రీచార్జి చేసుకుంటేనే కరెంట్.. లేదంటే కట్!
- స్మార్ట్ మీటర్లపై నాలుక మడతేసిన బాబు


పలమనేరు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యుత్ వినియోగ సమాచారం

జిల్లాలో మొత్తం ఇంటి సర్వీసులు	3,81,690
వ్యవసాయ విద్యుత్ మోటార్ కనెక్షన్లు	1.25 లక్షలు
కుటీర పరిశ్రమల సర్వీసులు మొత్తం	4736
వాణిజ్య సర్వీసులు మొత్తం	4163
జిల్లాలోని జగనన్న లేఅవుట్లు	592

పలమనేరు : ఎన్నికల్లో తానిచ్చే మాట మీద నిలబడే నైజం తనది కాదని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారని రైతాంగం మండిపడుతోంది. స్మార్ట్ మీటర్లు వద్దంటూ వైఎస్సార్ సీపీ పాలనలో రాద్ధాంతం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తనదైన స్టయిల్లో అన్ని వర్గాల ప్రజలకు బాదుడే బాదుడు మొదలెట్టారు. ఎన్నికల ముందు బాదుడే బాదుడు కార్యక్రమం పేరిట కుప్పం పర్యటనకు, ఆ తర్వాత పలమనేరుకు వచ్చిన ఆయన స్మార్ట్ మీటర్లతో రైతులకు ఉరితాడు తప్పదని, వైఎస్సార్‌సీపీ సర్కార్ జనాన్ని ముంచేస్తోందని స్మార్ట్ మీటర్లను అమర్చితే పగులగొట్టాలని జనాన్ని రెచ్చగొట్టారు. తాము అధికారంలోకి రాగానే వీటిని రద్దు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చి ప్లేటు ఫిరాయించారు. స్మార్ట్ మీటర్లను అమర్చుతోంది. మాట తప్పిన చంద్రబాబు, లోకేష్‌పై సామాన్య జనం మండిపడుతున్నారు.

ఇప్పుడు రైతులకు ఉరి కాదా?

అధికారంలోకి వచ్చే సరికి స్మార్ట్ మీటర్లతో ఎన్నో లాభాలుంటాయంటూ నాలుక మడతేశారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలకు కేటగిరి–1 గృహాలకు స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారు. త్వరలో రైతుల మోటార్లకు కూడా అమర్చడం ఖాయంగా కనిపిస్తోంది.

ముందుగా రీచార్జి చేసుకోవాలి

స్మార్ట్ మీటర్లను ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి దాకా ఉన్న పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారు. ఇప్పటి వరకు మీటరు రీడింగ్ చూసి కరెంట్ బిల్లు ఇచ్చేవారు. ఇకపై ఎవరితోనూ పని ఉండదు. స్మార్ట్ ఫోనుకు ముందుగా ఎలా రీచార్జి చేసుకుంటామో అదే విధంగా కరెంట్ బిల్లును ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది.

త్వరలో గృహాలకు

స్మార్ట్ మీటర్లను గృహాలకు ఆపై రైతుల వ్యవసాయ మోటార్లకు వీటిని అమర్చనున్నారు. దీంతో ఇళ్లకు సైతం వినియోగదారులు ముందుగానే ఆన్‌లైన్ ద్వారా కరెంట్ బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అదే రీతిలో రైతులు వారి మోటార్ హెచ్‌పీని బట్టి ముందుగానే (ప్రీపెయిడ్) డబ్బులు రీచార్జి చేసుకోవాలి. డబ్బులు చెల్లించకపోతే ఆటోమేటిక్‌గా కరెంట్ డిస్‌కనెక్ట్ అవుతుంది.

మీటర్ రీడర్లకు మంగళం

ఉమ్మడి జిల్లాలో వేల మంది మీటర్ రీడర్లున్నారు. వీరు ప్రతి నెలా ఇంటింటికి వెళ్లి కరెంట్ రీడింగ్‌ను బుక్ చేసి తద్వారా కరెంట్ బిల్లులు అందించేవారు. ఇకపై స్మార్ట్ మీటర్ల రాకతో వీరి ఉద్యోగాలు పోయినట్టే. దీంతో వీరు సైతం స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనిపై ఆందోళనలకు సైతం దిగే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

దుకాణదారులకు ఇబ్బందే..



మొబైల్ ఫోన్‌కు లాగే ముందుగా ఎంత రీచార్జి చేసుకుంటే అంత వరకే కరెంట్ ఇవ్వడం ఆపై కట్ చేయడం చేస్తే ఎవరికైనా ఇబ్బందే కదా. ఒక్కో నెలలో దుకాణంలో వ్యాపారం తగ్గుముఖం పడితే డబ్బు ఉన్నప్పుడు పెనాల్టి కట్టి అయినా కరెంట్ బిల్లు కట్టే వెసలుబాటు ఉండేది. కానీ ఇప్పుడు ముందుగానే కట్టాలంటే కుదిరేపనేనా. ఉన్నట్టుండి కరెంట్ పోతే జరిగే పనులులెలా.

– సుభాన్, హోటల్ యజమాని, పలమనేరు

రైతులకు అవస్థలు



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో రైతులకు ఇబ్బందులు తప్పవు. రైతు వరి పంట వేసి నీటి తడులు ఇవ్వాల్సిన తరుణంలో కరెంట్ చార్జీ కట్టలేదని కరెంట్ డిస్ కనెక్ట్ చేస్తే ఆ రైతు పంట ఏమి కావాలి. రైతు పంట కష్టం నేలపాలు కావాల్సిందేనా. గతంలో స్మార్ట్ మీటర్లు వద్దన్న చంద్రబాబు ఇప్పుడు ఎలా అమలు చేస్తు న్నారు. వేరే వాళ్లు చేస్తే తప్పు.. ఆయన చేస్తే మంచిదా.

– గిరిధర్ గుప్తా, సీపీఎం నేత, పలమనేరు

అదానీ కంపెనీ మేలు కోసమేనా ?



గతంలో వైఎస్సార్‌సీపీలో స్మార్ట్ మీటర్ల వ్యవహారంపై తీవ్రంగా విమర్శించి వాటిని పగులగొట్టాలని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు వీటిని అమర్చుతున్నారో జనానికి తె లుసు. కేవలం కేంద్రంలోని బీజేపీకి చెందిన అదా నీ కంపెనీ మేలు కలిగేలే జనంపై భారం మోపు తున్నారు. తాము రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల రద్దుపై నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాం.

– రమాదేవి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు

అన్ని క్యాటగిరిలకు ఏర్పాటు చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు స్మార్ట్ మీటర్లు పూర్తి చేస్తాం. ఆపై గృహాలు మళ్లీ రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తాం. దీంతో విద్యుత్ ఆదా, విద్యుత్ చౌర్యం తగ్గుతుంది. ముందుగానే డబ్బు చెల్లించడంతో పెండింగ్ బకాయిల సమస్య తగ్గుతుంది. దీంతో డిస్కంలకు ప్రయోజనం చేకూరుతుంది.

– శ్రీనివాసమూర్తి, విద్యుత్ డీఈ, పుంగనూరు